ఉష్ణోగ్రత (అంచనా)

29-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	25
తెనాలి	38	26
నరసరావుపేట	40	25
బాపట్ల	36	27
రెంటచింతల	41	26



మహాత్మా గాంధీ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

- యువత చేతిలో.. దేశ భవిష్యత్తు!
- సంస్థలను స్థాపించేలా ఎదగండి
- 2న ప్రధాని చేతుల మీదుగా రాజధాని పనుల ప్రారంభం
- అప్పటి నుంచి అమరావతి అన్‌స్టాపబుల్
- విట్ వర్సిటీలో 'వీ లాంచ్ ప్యాడ్ 2025 - స్టార్టప్ ఎక్స్ పో'లో సీఎం
- క్యాంపస్‌లో పలు భవనాల ప్రారంభం

క్వాంటం వ్యాలీగా.. అమరావతి

గుంటూరు,తుళ్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని, సిలికాన్ వ్యాలీకి దీటుగా అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని రూపొందిస్తామని సీంఎ చంద్రబాబు అన్నారు. రాజధానిలోని విట్ అమరావతిలో సోమవారం నిర్వహించిన 'వీ లాంచ్ ప్యాడ్ 2025- స్టార్టప్ ఎక్స్‌పో'లో ఆయన పాల్గొన్నారు. క్యాం పస్‌లో నూతనంగా నిర్మించిన మహాత్మాగాంధీ బ్లాక్, వీవీ గిరి బ్లాక్, ఆచార్య ఎన్‌జీ రంగా, దుర్గా బాయి దేశ్ ముఖ్ బ్లాక్‌లను విట్ అధినేత విశ్వ నాథన్, మంత్రి దుర్గేష్‌తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టార్టప్ ఎక్స్‌పోను ప్రారంభించి ఎక్స్‌పో పాల్గొన్న విద్యార్థులతో సీఎం ఇంటరాక్ట్ అయ్యారు. దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని, యువత రం ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదగాలని, అప్పుడే 2047నాటికి భారత దేశం ప్రపంచంలో నెంబర్ వన్ అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఎక్స్‌పోలో ప్రద ర్శించిన ఆవిష్కరణల వివరాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం సభలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మే 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని పనుల పునఃప్రారంభం కాబోతున్నాయని చెప్పారు.

విట్ అధినేత విశ్వనాథన్ సాధారణమైన వ్యక్తిగా తన జీవితం ప్రారంభించి అసాధారణమైన వ్యక్తిగా ఎదిగిన తీరు అభినందనీయమని ముఖ్యమంత్రి అన్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఆయన అన్నాదురై, కరుణానిధి, ఎంజీఆర్, జయలలితతో పనిచేశారని గుర్తుచేశారు. విశ్వనాథన్ 2014లో ఎన్నికల ఫలితాలు రాకముందే తనను కలిసి, గెలిచిన వెంటనే అమరావతిలో విట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారన్నారు. ఆయన ఆరోజున 200 ఎకరాలు అడిగితే, 100 ఎకరాలే ఇచ్చామని, మిగిలిన భూమి కూడా ఇచ్చే బాధ్యత తమ దేనని, అయితే ప్రస్తుతం ఉన్న 17వేల మంది విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడేళ్లలో 50వేలకు పెరగాలని ఆయన షరతు విధించారు. విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్‌మెంట్స్ జరుగు తుండటం అభినందనీయమని, ప్రపంచంలోని టాప్ 100 యూనివర్సిటీలో విట్ ఉండటం మనకు గర్వకారణమని, అయితే విట్ విద్యా సంస్థల్లో మనఅమరావతి విట్ నెంబర్‌వన్‌గా ఉండాలని కోరుకుంటున్నాని ముఖ్యమంత్రి చెప్పారు.

కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, తాడికొండఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, విట్ యూనివర్సిటీ ఫౌండర్, చాన్సలర్ డా.జీ విశ్వనాథన్, టీఐఈ గ్లోబల్ చైర్మన్ మురళి బుక్కపట్నం, బీఐఎల్ గ్లోబల్ సీఈఓ ఎడియటా వోల్సిక్, టాటా కన్సెల్టీన్సీ సర్వీస్ హెడ్ చల్లా నాగ్, విట్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరీ ఎస్ విశ్వనాథన్, వైస్ చాన్సలర్ డా. ఎస్వీ కోటా రెడ్డి, జిల్లా అధికారులు, విట్ యూనివర్సిటీ ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతికి తిరుగులేదు

సీఎం చంద్రబాబు

ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పనులు మే 2న పునఃప్రారంభమ వుతాయని, తాను అంద రిలా మాటలు చెప్పనని, ప్రజలకు మంచి చేసి చూపిస్తానని చెప్పారు. తనపై నమ్మకం పెట్టుకుని 29 వేల మంది రైతులు, 34 వేల ఎకరాల భూమి రాజధానికి ఇచ్చారని, అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని రైతులు ముందుకురావడం అభినందనీయమని అన్నారు. ఆ 29 గ్రామాల బిడ్డలకు అమరావతిలో అత్యుత్తమ విద్య పొందే అవకాశం కల్పించాలని, వారిలోంచి ఎంటర్‌ప్రెన్యూర్లను వెలికి తీయాలని భావిస్తున్నట్లు సీఎం చెప్పారు. 1991లో ఆర్థిక సంస్కరణలకు మన తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు శ్రీకారం చుట్టారు. వాటిని తాను అందిపుచ్చుకున్నానని, భవిష్యత్ ఐటీదేనని గ్రహించి దానికి అధిక ప్రాధాన్యత ఇచ్చానని, 14 నెలల్లో హైటెక్ సిటీ నిర్మించామన్నారు. ఇప్పుడు రాజధాని అమరావతిపై దృష్టి కేంద్రీకరించామని, త్వరలో అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు.. సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి ఫౌండేషన్ వేస్తున్నామన్నారు. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుని ప్రతి ఇంట్లో ఎంట్రప్రెన్యూర్ తయారు కావాలన్నారు.. అమరావతిలో విట్, ఎస్ఆర్ఎం వంటి విద్యా సంస్థలు ఇప్పటికే పనిచేస్తున్నాయి. భవిష్యత్‌లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యూనివర్సిటీలు అమరావతికి రాబోతున్నాయన్నారు. 29 వేల మంది రైతులు, రైతు కూలీలు అమరావతికి సహకరించారని, వారందరినీ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం వివరించారు. వారిలో కొందరిని దత్తత తీసుకోవాలని విట్ చాన్సలర్ విశ్వనాథన్‌ను కోరినట్లు చెప్పారు. రాష్ట్రంలో కొత్త విద్యాసంస్థల ఏర్పాటు, ఐటీ, ఏఐ వినియోగంపై విట్ విద్యార్థులు పలు ప్రశ్నలు అడగ్గా ముఖ్యమంత్రి వాటికి సమాధానం చెప్పారు.



వీఐటీలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

విధేయతకే పట్టం

- గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా కోవెలమూడి ఎన్నిక
- 7 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన టీడీపీ అభ్యర్థి
- ప్రమాణ స్వీకారం.. వెనువెంటనే బాధ్యతల స్వీకరణ
- గంటలోనే ముగిసిన మేయర్ ఎన్నిక ప్రక్రియ
- అన్నీ తానై నడిపించిన కేంద్ర మంత్రి పెమ్మసాని
- వెల్లువెత్తిన అభినందనలు.. ఆనందోత్సాహాలు.
- నగరంలో భారీ ర్యాలీ.. ఊరేగింపు



మేయర్‌గా ఎన్నికైన రవీంద్రకు మేయర్ టోపీ పెడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్.

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గుం టూరు నగర మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర(నాని) ఎన్నికయ్యారు. నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన ఎన్నిక ప్రక్రియలో గుంటూరు నగరపాలక సంస్థ 7వ మేయర్‌గా గెలుపొంది, పదవీ బాధ్యతలు చేపట్టారు. సోమవారం గుంటూరు నగర మేయర్ పదవికి జరిగిన ఎన్నికలో కూటమి ప్రభుత్వం తరఫున టీడీపీ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్ర, వైసీపీ అభ్యర్థిగా అచ్చాల వెంకటరెడ్డి బరిలో నిలిచారు. అచ్చాల వెంకటరెడ్డిపై కోవెలమూడి రవీంద్ర 7 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గుంటూరు నగర మేయర్‌గా కోవెల మూడి రవీంద్ర గెలుపొందినట్లుగా ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ ప్రకటించారు. ఈ మేరకు డిక్లరేషన్ ఫామ్‌ను అందజేశారు. నగరపాలక సంస్థలో 57 మంది కార్పొరేటర్లు, ఒక ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారు. వారిలో 48వ డివిజన్ కార్పొరేటర్ తను బుద్ధి కృష్ణారెడ్డి మరణించారు. దీంతో కార్పొరేటర్ల సంఖ్య 56 కాగా, మొత్తం 63 మందికి కాను 61 మంది మాత్రమే మేయర్ ఎన్నికల్లో పాల్గొన్నారు. వైసీపీకి చెందిన కార్పొరేటర్లు మర్రి అంజలి, యాట్ల రవికుమార్ ఎన్నికల్లో పాల్గొనలేదు.



మేయర్‌గా నానిచే ప్రమాణం చేయిస్తున్న జేసీ భార్గవ తేజ, ప్రక్కన కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, మాధవి, నసీర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, సజీలా

7 ఓట్ల మెజార్టీతో విజయం..

నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్రను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు ప్రతిపాదించారు, జనసేనకు చెందిన కార్పొరేటర్ సంకురి శ్రీనివాసరావు బలపరిచారు. వైసీపీ అభ్యర్థి అచ్చాల వెంకటరెడ్డిని మేయర్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ చం ద్రగిరి ఏసురత్నం ప్రతిపాదించారు. 45 డివిజన్ కార్పొరేటర్ ఎక్క లూరి మారుతీరాణి బలపరిచారు. మొత్తం 61 మంది ఓటింగ్‌లో పాల్గొనగా టీడీపీ అభ్యర్థి నానికి 34 ఓట్లు వచ్చాయి. వైసీపీ అభ్యర్థి వెంకట్ రెడ్డికి 27 ఓట్లు వచ్చాయి. దీంతో మెజార్టీ సభ్యులు చేతులెత్తి నానిని ఎన్నుకున్నారు. వైకాపా సభ్యులు ఇద్దరూ హాజరైనప్పటికీ మేయర్‌గా నాని గెలుపు ఆగేది కాదు. నాని గెలుపొందడంతో వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ఆ పార్టీకి చెందిన మిగతా 25 మంది కార్పొరేటర్లు సమావేశం నుంచి వెళ్లిపోయారు.





కార్పొరేషన్‌కు వస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని , ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ అహ్మద్, రామాంజనేయులు ఎమ్మెల్సీ ఆలపాటి. టీడీపీ కార్పొరేటర్లు

ప్రమాణ స్వీకారం, బాధ్యతల స్వీకరణ

గుంటూరు నగర మేయర్‌గా గెలుపొందిన నాని కౌన్సిల్ హాల్‌లోనే మేయర్ పీఠాన్ని అధిష్ఠించారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ అహ్మద్, రామాం జనేయులు తదితరుల సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారి భార్గవ్‌తేజ నానితో మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొద్దిసపటికి మేయర్ చాంబర్‌లోకి వచ్చి గుంటూరు మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. హిందూ, క్రైస్తవ, ముస్లిం మత పెద్దల ఆశీర్వచనాలు పొందారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించి, మేయర్ (మిగతా 6వ పేజీలో)

మాచర్ల మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా.. మదార్ సాహెబ్

ఏకగ్రీవంగా ఎన్నిక



8

మదార్‌సాహెబ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

డీపీఓ విజయ భాస్కరరెడ్డి బదిలీ

వివాదాస్పద అధికారిగా పేరొందిన వైనం



డీపీఓ విజయ భాస్కరరెడ్డి

నరసరావుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి ఏవీ విజయ భాస్కరరెడ్డి ఎట్టకేలకు బదిలీ అయ్యారు. ప్రకాశం జిల్లా మార్కాపురం డీఎల్‌పీవోగా బదిలీ చేస్తూ పంచాయతీ రాజ్ శాఖ ప్రధాన కార్యదర్శి శశి భూషణ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా పంచాయతీ అధికారికిగా ఎస్వీ నాగేశ్వర్ నాయక్‌ను ప్రభుత్వం నియమిం చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో తెలుగు దేశం సానుభూతిపరులైన సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయడంలో భాస్క రరెడ్డి కీలకంగా వ్యవహరించారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెలి రామకృష్ణారెడ్డి గత ఎన్నికల్లో పాల్వాయి గేట్ పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు ధ్వంసం చేసి న ఉదంతంలో కూడా భాస్కరరెడ్డి విచారణను ఎదుర్కొన్నారు. వెబ్ కాస్టింగ్ ఇన్‌చార్జిగా ఉన్న భాస్కరరెడ్డి ఈవీఎంల ధ్వంసంపై నివేదిక ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంలో అయనపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అయితే, కొందరు టీడీపీ నేతల అండదం డలతోనే ఇన్నాళ్లు భాస్కరరెడ్డి జిల్లాలో విధులు నిర్వహించారన్న ఆరోపణ లున్నాయి. అయనను బదిలీ చేయడంతో బాధిత సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ తానే కొనసాగుతానని భాస్కరరెడ్డి ప్రచారం చేసుకుంటున్నట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారులు తననే కొనసాగిస్తారని, కొత్తగా నియమితులైన అధికారిని విధుల్లో చేరనివ్వరని చెపుతూ ధీమా వ్యక్తం చేస్తున్నట్లు పంచాయతీ రాజ్ వర్గాలు చెబుతున్నాయి.

డీసీసీబీ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే మక్కెన

- 'వడ్రాణం'కు డీసీఎంఎస్
- కుర్రా అప్పారావుకు మరో పోస్టు హామీ



మక్కెన మల్లికార్జునరావు
డీసీసీబీ చైర్మన్



వడ్రాణం హరిబాబు
డీసీఎంఎస్ చైర్మన్

నరసరావుపేట, వినుకొండ, గుంటూరు సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాను నామినేటెడ్ పదవు లు వరించాయి. 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పిన ట్లుగా ఆ ఇద్దరు నేతల్లో ఒక్కరికి డీసీసీబీ పదవి దక్కింది. అత్యంత కీలకమైన పదవిగా భావించే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్ గా పల్నాడు జిల్లా వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జిల్లా మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్‌గా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు వడ్రాణం హరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత డీసీసీబీ చైర్మన్ పదవి కోసం పలువురు పోటీపడ్డారు. మక్కెనతో పాటు టీడీపీ ముఖ్య నేత కుర్రా అప్పారావు పేర్లు ప్రముఖంగా వినిపించాయి. కుర్రా అప్పారావుకు ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు మద్దతు కూడా ప్రకటించారు. అయితే 2024 ఎన్నికల సందర్భంగా మక్కెనకు డీసీసీబీ పదవి ఇస్తానని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఆ హామీని నిలబెట్టుకునే నేపథ్యంలో డీసీసీబీకి మక్కెన పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో అత్యంత కీలకంగా వ్యవహరించిన కుర్రా అప్పారావుకు మరో కీలక పదవి ఇచ్చేందుకు టీడీపీ అధి ష్ఠానం హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే ముఖ్యమైన పోస్టులకు నియామకాలు జరగనున్నందున కుర్రాకు అవకాశం వస్తుందని చెబుతున్నారు.

గుజరాత్ టు గుంటూరు

- మార్కెట్‌ను ముంచెత్తుతున్న నిషేధిత పత్తి విత్తనాలు
- ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా విక్రయాలు

6

పాఠ్యపుస్తకాల పంపిణీకి ముందస్తు ఏర్పాట్లు

పాఠశాలలు ప్రారంభం కాగానే పంపిణీ • ఉమ్మడి జిల్లాకు అవసరం

13.24 లక్షలు.. ఇప్పటికే వచ్చినవి 7.50 లక్షలు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పునప్రారంభం అయ్యే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేలా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా గుంటూరులోని పుస్తకాల గోదాము నుంచి ఉమ్మడి జిల్లాలోని స్టాక్ పాయింట్లకు పాఠ్యపుస్తకాలు పంపిణీ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, కేజీబీవీ ,మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, మండల పరిషత్ మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల ఆధ్వర్యంలో దాదాపు 6 వేలకు పైగా పాఠశాలలు ఉన్నాయి .ఆయా పాఠశాలల్లో దాదాపు 6.75 లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయా విద్యార్థులకు తరగతుల వారీగా మారిన సిలబస్ ప్రకారం నూతన పాఠ్యపుస్తకాల పంపిణీకి విద్యాశాఖ ఇప్పటికే ఏర్పాటు చేసింది. జిల్లాకు వచ్చిన పాఠ్యపుస్తకాలను ఎప్పటికప్పుడు ఆర్టీసీ బస్సుల ద్వారా రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల కోసం ప్రత్యేకంగా గోదాములు ఏర్పాటు చేశారు. గోరంట్లలో ఒకటి మంగళగిరి రోడ్డులో మరొక గోదాము ఉన్నాయి. ఆయా గోదాములకు వచ్చిన పాఠ్య పుస్తకాలను ఉమ్మడి జిల్లాలోని మండలాల వారీగా పంపించేందుకు డీఈఓ సివి రేణుక ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రధాని సభకు.. మంత్రులకు బాధ్యతలు

- మంగళగిరి వైపు నుంచి వచ్చే ప్రజల బాధ్యత మంత్రి గొట్టిపాటికి
- రాజధానిలో మనోహర్ రచ్చబండ కార్యక్రమాలు

8

ఆయిల్ చోరీ కేసు..వైసీపీ నేత అరెస్టు

● కోర్టులో హాజరుపరిచిన నెల్లూరు పోలీసులు



నీళ్లవాగులో పడిన ఆయిల్ ట్యాంకర్

పిడుగురాళ్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లకు చెందిన వైసీపీ నేత చీదెళ్ల కృష్ణ, రవిపై నెల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సౌత్ ఇండియా కంపెనీ నుండి బెంగళూరులోని సౌభాగ్య ఫుడ్స్‌కు వెళ్లాల్సిన ఆయిల్ ట్యాంకర్‌ను పిడుగురాళ్లకు చెందిన వైసీపీ నేత చీదెళ్ల కృష్ణ, రవి, ట్యాంకర్ డ్రైవర్, మరికొందరితో కలిసి దారి మళ్లించారు. ట్యాంకర్‌లోని ఆయిల్‌ను తోడించేశారు. అనంతరం కట్టుకథ అల్లి నమ్మించేందుకు ఆయిల్ ట్యాంకర్ వాగులో పడిపోయినట్లుగా చిత్రీకరించారు. సౌత్ ఇండియా కంపెనీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. పోలీసుల దర్యాప్తులో భాగంగా లారీ డ్రైవర్‌ను విచారించారు. పిడుగురాళ్లకు చెందిన చీదెళ్ల కృష్ణ, రవితో కలిసి ఆయిల్‌ను చోరీ చేసినట్లు అతను వెల్లడించాడు. కృష్ణ, రవి ఆయిల్‌ను ప్యాకెట్లు, డబ్బాలకు నింపి కొంత కల్తీ కలిపి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు వాంగ్మూలం ఇచ్చాడు. దీంతో ఈ ఘటనకు సంబంధించిన వారందరినీ నెల్లూరు పోలీసులు అరెస్టు చేశారు. నెల్లూరుకు చెందిన మరో నలుగురు ఈ చోరీలో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు.

గుజరాత్ టు గుంటూరు

● మార్కెట్‌ను ముంచెత్తుతున్న నిషేధిత పత్తి విత్తనాలు ● ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా విక్రయాలు



గుంటూరు సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి తీవ్రంగా హాని కలిగించే బీజీ-3 పత్తి విత్తనాలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో హల్ చల్ చేస్తున్నాయి. ఖరీఫ్ సాగు కోసం పత్తి విత్తనాలు కొనుగోలుకు ముందుకు వస్తున్న రైతులకు బీజీ-3ని అంటగడుతున్నారు. గుంటూరుకు కూత వేటు దూరంలోని తాడికొండ, అమరావతి, పల్నాడులో జిల్లాలోని మరికొన్ని మండలాల్లో నేరుగా ఇళ్ల వద్దకు తీసుకువెళ్లి నిషేధిత విత్తనాలు విక్రయిస్తున్నారు. దిగుబడి పెరగడంతో పాటు,చీడ, పీడలను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం ఎక్కువగా ఉండటంతో రైతులు కూడా అత్యంత ప్రమాదకరమైన బీజీ-3 వైపు మొగ్గుచూపుతున్నారు.

బీజీ- 3 చాలా ప్రమాదం

పత్తి దిగుబడి పెంచేందుకు విరివిగా జరిపిన పరిశోధనల ఫలితంగా బీటీ, బీజీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చాయి. బీటీ సాగుకు ప్రభుత్వ అనుమతి ఉంది. బీటీ విత్తనాలు మార్కెట్ లోకి వచ్చిన తరువాత పత్తి సాగు పూర్తి లాభదాయకం గా మారింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం ఆవిష్కృతమైన బీటీ విత్తనాలు ప్రస్తుతం కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. నాలుగు సంవత్సరాలుగా తెగుళ్ల సోకటం వల్ల రైతులు బీటీ ని పెద్దగా విశ్వసించని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బీజీ-3పై మక్కువ పెరుగుతున్నట్లు కనిపిస్తున్నది. అయితే పర్యావరణానికి తీవ్రంగా హాని కలిగిస్తున్న బీజీ-3 ని ప్రభుత్వం ఎప్పుడో నిషేధించింది. బీజీ-3 అమ్మకాలు జరిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు కూడా హెచ్చరికలు జారీ చేశారు. అయినా కొందరు వ్యాపారులు వాటినే విరివిగా అమ్ముతున్నారు. గతంలో అనేక మార్లు పట్టుబడిన వ్యాపారులే ప్రస్తుతం తాడికొండ, అమరావతి మండలాల్లో ఎక్కువగా బీజీ-3 విత్తనాలు విక్రయిస్తున్నారు. పల్నాడు జిల్లాలో కూడా అదే విత్తనాలు ఎక్కువగా అమ్ముడు పోతున్నాయి.

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో విరివిగా అమ్ముతున్న బీజీ-3 విత్తనాలు గుజరాత్ నుంచి తెస్తున్నట్లు తెలుస్తుంది. గుంటూరు నుంచి ఉమ్మడి జిల్లా లోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి ప్రస్తుతం తెలంగాణ కు కూడా ఎక్కువ మొత్తంలో పత్తి విత్తనాలు వెళ్తున్నాయి.కొన్ని ప్రాసెసింగ్ యూనిట్లు కూడా రైతులను దగాచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

తూతూ మంత్రమే...

వ్యవసాయ శాఖ నిర్వహించే దాడులు తూతూమంత్రంగా ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. కమిషనరేట్ ఆదేశాలతో ఆరంభం అయ్యే దాడుల వివరాలు కూడా విత్తనాల వ్యాపారులకు ముందే తెలుస్తాయన్న ఆరోపణలు ఉన్నాయి. దాడులకు వెళ్లే అధికారులు నామ్‌కే వాస్తేగా నమూనాలను సేకరిస్తున్నట్లు తెలుస్తుంది.

నాలుగు పళ్ల విభాగంలో మఠంపల్లి ఎడ్లజత విజయం

దాచేపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి శ్రీ వీర్ల అంకమ్మ తల్లి కొలుపులతో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో ఆదివారం హోరాహోరీగా జరిగాయి. నాలుగుపళ్ల విభాగంలో తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మఠంపల్లి గ్రామానికి చెందిన గాదె సుందరమ్మ, బాల్‌రెడ్డి మెమోరియల్, గాదె ఆషేర్, సుమన్‌బీ ఎడ్లజత, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం తుర్లపాడుకు చెందిన పోకూరి ఆదినారాయణ సంయుక్త ఎడ్ల జత 5,059 అడుగులు దూరం బండను లాగి మొదటి స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా గడివేముల మండలం గడిగిరేవుల గ్రామానికి చెందిన పెరుమాళ్ల సంజయ్‌కుమార్ ఎడ్లజత 4,932 అడుగులతో రెండోస్థానం, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మోపర్తి వెంకటేశ్వరరావు అండ్ కంపెనీ, మోపర్తి నవీన్‌కుమార్ చౌదరి ఎడ్లజత 4,500 అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామానికి చెందిన శ్రీకావ్య నంది బ్రీడింగ్ బుల్స్ సెంటర్ రామకోటయ్య ఎడ్ల జత 4,432 అడుగులతో నాలుగో స్థానం, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం విప్పర్లేనికి చెందిన బాషికారెడ్డి, జ్ఞాన్విత్‌రెడ్డి ఎడ్లజత 4,312 అడుగులతో ఐదోస్థానం, పల్నాడు జిల్లా సత్తెపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన పసుమర్తి దివ్యశ్రీ ఎడ్లజత 3,850 అడుగులతో ఆరో స్థానం,



నాలుగుపళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎడ్లజత

బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామానికి చెందిన సూది బ్రదర్స్ ఎడ్లజత 3,750 అడుగులతో ఏడోస్థానం, బాపట్ల జిల్లా ఎద్దలపూడికి చెందిన మేస్త్రి ఖాదర్ మస్తాన్ బుల్స్ ఎడ్ల జత 3,316 అడుగులతో ఎనిమిదో స్థానంలో నిలిచాయి. మొదటి స్థానం సాధించిన ఎడ్లజతకు తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మహేశ్వరి ట్రేడర్స్ మేడపి నరసింహారావు రూ. 25 వేలు, రెండో బహుమతిని కొప్పుల నరసింహారావు, శ్రీనివాసరావు రూ. 20 వేలు, మూడో బహుమతి రూ. 15 వేలను గాలె హనుమంత్ కుమారులు అందజేశారు.

గుంటూరు మీదగా చర్లపల్లి, కాకినాడ, నరసపూర్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల కారణంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, కాకినాడ, నరసపూర్‌లకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ ఎ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. (07031) చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు మే 2 నుంచి జూన్ 27వ తేదీ వరకు ప్రతి శుక్రవారం రాత్రి 7.20 గంటలకు బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు వేకువజామున 4.30 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. (07032) కాకినాడ టౌన్ - చర్లపల్లి ప్రత్యేక రైలు మే 4 నుంచి జూన్ 29వ తేదీ వరకు ప్రతి ఆదివారం సాయంత్రం 6.55 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదగా మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకి చర్లపల్లి చేరుకొంటుంది. (07233) చర్లపల్లి - నరసపూర్ ప్రత్యేక రైలు మే 2 నుంచి జూన్ 27వ తేదీ వరకు ప్రతి శుక్రవారం రాత్రి 7.15 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు వేకువజామున 5.50 గంటలకు నరసపూర్ చేరుకుంటుంది. (07234) నరసపూర్ - చర్లపల్లి ప్రత్యేక రైలు మే 4 నుంచి జూన్ 29వ తేదీ వరకు ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

స్టెమీ ఇంజక్షన్ సంజీవని వంటిది

● తెనాలి జిల్లా వైద్యశాలలో ఐసీఎంఆర్ బృంద సభ్యులు

● గుండెపోటు చికిత్సపై ఆరా..వైద్యుల పనితీరుపై సంతృప్తి

తెనాలిరూరల్, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురయ్యే రోగులకు మొదటి గంటలో స్టెమీ ఇంజక్షన్ అందిస్తే సంజీవనిలా ప్రాణాలు కాపాడుతుందని ఐసీఎంఆర్(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) బృంద సభ్యులు పేర్కొన్నారు. సోమవారం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో బృంద సభ్యులు స్టెమీ ఇంజక్షన్ ఇచ్చే విధానంపై వైద్యాధికారులతో సమావేశమయ్యారు. ఇంజక్షన్ భద్రపర చడం, వినియోగం, ఇంజక్షన్ అనంతరం రోగులకు కార్డియాలజీ డిపార్ట్‌మెంట్‌లో అందుతున్న వైద్య సేవలు, వారి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇంజక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినప్పటి నుండి ఇప్పటి వరకూ 60 మందికి అందించామని వైద్యా ధికారులు తెలిపారు. వారందరూ ఆరోగ్యంగా జీవిస్తున్నారని వివరించారు. దీంతో బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో సభ్యులు, న్యూఢిల్లీకి ఏయిమ్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ మీనాక్షి శర్మ మాట్లాడారు. గుండెపోటుకు గురైన వారిలో చాతి నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇవి ఉత్పన్నమైన మొదటి గంటలోపు రూ.45వేల స్టెమీ ఇంజక్షన్ అందిస్తే ప్రాణాలు నిలబెట్టుకోవచ్చన్నారు. వైద్యశాలలో



వైద్యశాలలో వివరాలు సేకరిస్తున్న ఐసీఎంఆర్ బృంద సభ్యులు

వైద్యుల పర్యవేక్షణ బాగుందని, మరింత మంచి సేవలందించేలా కృషి చేయాలని సూచించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, ఆర్‌ఎంఓ డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్లు తిలకి వినీల్, డాక్టర్ శ్రీకాంత్, పలవురు వైద్యులు పాల్గొన్నారు.

విధేయతకే పట్టం

(5వ పేజీ తరువాయి)

ఎన్నిక ప్రక్రియ, ప్రమాణ స్వీకారం, బాధ్యతల స్వీకరణ అంతా గంటలోనే పూర్తయింది.

తెలుగుదేశం పార్టీకి విధేయుడిగా..

తెలుగుదేశం పార్టీకి విధేయుడిగా, పార్టీ కార్యక్రమాలను నడిపిస్తూ.. పార్టీ ఆదేశాలను శిరసా వహిస్తున్న కోవెలమూడి రవీంద్ర (నాని) గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పీఠాన్ని అధిష్టించారు. ఆయనను మేయర్‌గా ఎంపిక చేసి గెలిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. దీంతో రంగంలో దిగిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశారు. తెలుగుదేశం పార్టీలో కోవెలమూడి నాని క్రియాశీలక పాత్ర పోషిస్తూ.. 20 ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తూ వచ్చారు. కార్యకర్తగా, నాయకుడిగా, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను ఆయన సమర్థంగా నిర్వహించారు. పార్టీ కష్ట కాలంలో కూడా ఆయన వెన్నంటి ఉండి, పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషి చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆయన టికెట్ ఆశించారు. అయితే సామాజిక సమీకరణాల మూలంగా సీటు చేజారింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మాధవికి సీటు కేటాయించినా.. ఆమె గెలుపునకు నాని కృషి చేశారు.

గతంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బాగా దెబ్బతింది. పార్టీ తరపున 57 మంది కార్పొరేటర్లు పోటీ చేయగా కేవలం 8 మంది మాత్రమే గెలుపొందారు. ఈ సమయంలో గుంటూరు నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్‌గా కౌన్సిల్లో నాని పార్టీ గళాన్ని వినిపించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలుపొందడంతో వైసీపీ కార్పొరేటర్లు కొంతమంది తెలుగుదేశంలో, మరికొందరు జనసేన పార్టీలో చేరారు. దీంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఆరుగురు సభ్యులను కూటమి గెలుపొందింది.

అన్నీ తానై నడిపించిన.. పెమ్మసాని

నగర మేయర్ ఎన్నిక ప్రక్రియ మొదలు నుండి... నాని నగర మేయర్‌గా బాధ్యతలు చేపట్టే వరకు అన్ని తానై కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముందుండి నడిపించారు. కార్పొరేటర్‌లను, ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను కలుపుకొని ముందుకు సాగారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు నానీని మేయర్‌గా గెలిపించి ఆయనను ఆ స్థానంలో కూర్చోబెట్టారు.

వెల్లువెత్తిన అభినందనలు, గుంటూరులో భారీ ర్యాలీ

నగర మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన కోవెలమూడి రవీంద్రను ప్రముఖులు కలిసి అభినందించారు. కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, మాధవి, నసీర్ అహ్మద్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, జనసేన పార్టీ నాయకులు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, టీడీపీ రాష్ట్ర నాయకులు మన్నవ మోహన్ కృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. అభినందన కార్యక్రమం అంతా కోలాహలంగా సాగంది. అనంతరం జీఎంసీ నుంచి ప్రత్యేక వాహనంపై మేయర్ భారీ ర్యాలీ నిర్వహించారు. అభిమానులు, పార్టీ నాయకుల సంబరాల మధ్య.. భారీగా బాణ సంచా కాలుస్తూ ఊరేగింపుగా సాగింది.

నేటి నుంచి ఎన్‌జీ రంగా వ్యవసాయ వర్సిటీ వజ్రోత్సవాలు

● బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ ఆచార్య శారద జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ)ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వీసీ ఆచార్య డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి తెలిపారు. సోమవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉత్సవాల బ్రోచర్‌ను ఆమె ఆవిష్కరించారు. వజ్రోత్సవాలు మంగళ, బుధవారాలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం



వజ్రోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ శారద జయలక్ష్మీదేవి, అధికారులు

హైదరాబాద్ నుంచి లాంఫాంకు విశ్వవిద్యాలయం 2016లో మార్పబడిందని పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలో ఏడు ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలు, 6 అఫ్లియేటెడ్, రెండు ఫుడ్ సైన్స్, రెండు అగ్రి ఇంజినీరింగ్, కమ్యూనిటీ సైన్స్ కాలేజీ, 18 గవర్నమెంట్ అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలలు, 40 ప్రైవేటు అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కాలేజీలు విస్తరించి ఉన్నాయని వెల్లడించారు. ఇప్పటి వరకు 503 నూతన వంగడాలు వివిధ పంటల్లో విడుదల చేయడం జరిగిందని చెప్పారు. విశ్వవిద్యాలయ పరిశోధన ఫలితాలు రైతులకు అందించడానికి వీలుగా ప్రతి జిల్లాకి ఒక విస్తరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

జడ్పీ సీఈవో బదిలీ.. ?

గుంటూరు సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు స్థానచలనం జరగనున్నట్లు తెలుస్తున్నది. ఈ మేరకు ఉన్నత స్థాయిలో రంగం సిద్ధమైనట్లు సమాచారం. జ్యోతి బసు గుంటూరుకు వచ్చిన తరువాత అతి తక్కువ సమయం మాత్రమే జడ్పీ ఛైర్‌పర్సన్‌తో సఖ్యతగా ఉన్నారు. కొద్ది రోజులకే వివాదాలు పొడచూపాయి. ఈ నేపథ్యంలో ఛైర్‌పర్సన్ సీఈఓ పై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. జడ్పీలో జరుగుతున్న వివాదాలపై ముఖ్య నేతలు కూడా దృష్టి సారించారు. వారి చొరవతోనే మార్పులు చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు. జ్యోతి బసు కూడా పంచాయతీ రాజ్ శిక్షణా కేంద్రానికి ప్రిన్సిపాల్‌గా వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త సీఈఓ కోసం కూటమి ప్రభుత్వంలోని కీలకమైన నాయకులు పావులు కదుపుతున్నారని అంటున్నారు. ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న అధికారిని ఇక్కడకు తీసుకువచ్చేందుకు రంగం సిద్ధం అయ్యినట్లు తెలుస్తున్నది. ఆయన ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వారు కావటంతో కొంతమంది ఆ విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. సొంత జిల్లాకు చెందిన వారిని సీఈఓ పోస్టులో నియమిస్తే న్యాయ పరమైన సమస్యలు వస్తాయని వివాదం తీసుకొస్తున్నారు.

చలన చిత్ర అభివృద్ధికి అవరోధంగా టీవీ సీరియల్స్

- సినీ నటుడు సుబ్బరాయశర్మ



భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చలనచిత్ర అభివృద్ధికి టీవీ సీరియల్స్ అవరోధంగా మారాయని చలనచిత్ర క్యారెక్టర్ ఆర్టిస్టు ఉప్పులూరి సుబ్బరాయశర్మ విమర్శించారు. భట్టిప్రోలు మండల పరిధిలోని పల్లెకోనలో నిర్వహిస్తున్న పరుచూరి రఘుబాబు జాతీయ స్థాయి ఆహ్వాన నాటికల పోటీలకు సోమవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చలన చిత్ర పరిశ్రమకు పూర్వ వైభవం రావాలంటే ప్రేక్షకుల్లోనే చైతన్యం రావాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో సినిమా హాల్స్ కల్యాణ మండపాలుగా మారిపోవడం చూస్తున్నామన్నారు. దీనికి కారణం సినిమా పట్ల ప్రేక్షకులలో ఆదరణ తగ్గడమేనన్నారు. ఇప్పటి వరకు 200 పైగా సినిమాల్లో నటించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు చిత్రంలో ఆయన కోరిక మేరకు నటిస్తున్నట్లు చెప్పారు. మజాకా సినిమాలో కూడా నటిస్తున్నట్లు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



గండికోట వెంకట మణి పృథ్వీరాజ్(ఫైల్)

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి కూతవేటు దూరంలో యువకుడి మృతి కలకలం రేపింది. మల్లిపాడు పంచాయతీ పరిధిలోని వెలగగుంట చెరువులో ఓ యువకుడు విగతజీవుడైపడి ఉండటాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. సమాచారమివ్వగా ఘటనా స్థలాన్ని త్రీటౌన్ పోలీసులు పరిశీలించారు. మృతుడు జగ్గడిగుంటపాలెం ఎదురు ఉన్న టిడ్కో ఇళ్లలో నివాసం ఉండే.. గండికోట వెంకట మణి పృథ్వీరాజ్ (27)గా గుర్తించారు. సామాజిక మాధ్యమంలో మృతుడి వివరాలు పెట్టడంతో కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. మృతుడు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుంటాడని, గత రాత్రి ఇంటిని నుండి వెళ్లి ఉదయం వరకు తిరిగి రాలేదని తల్లిదండ్రులు తెలిపారు. మృతికి గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు. ఘటనా స్థలంలో పగిలిన ఇటుకరాయి, కత్తి ఉండటాన్ని గుర్తించారు. మృతదేహన్ని పోస్మార్టం నిమిత్తం జిల్లా ప్రభు త్వ వైద్యశాలకు తరలించారు. క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలను సేకరించింది. ఘటన జరిగిన రాత్రి కొందరు యువకులు ఈ ప్రాంతంలో మద్యం సేవించి, యువకుడిని హత్య చేసి పరారై ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.

ఆరుగురుకి ఎంపీడీవోలుగా ప్రమోషన్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండల పరిషత్ కార్యాల యాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఆరుగురికి మండల అభివృద్ధి అధికా రులుగా ప్రమోషన్ లభిం చింది. ప్రమోషన్లు పొందిన వారిని ఉమ్మడి జిల్లాకే కేటాయించడం జరిగింది. ఎంపీడీవోగా ప్రమోషన్ పొందిన వారిలో దాచేపల్లిలో ఏవోగా పనిచేస్తున్న పీ రత్నం, గురజాలలో ఏవోగా పనిచేస్తున్న ఆర్ సాంబశివరావు, భట్టిప్రోలు డిప్యూటీ ఎంపీడీవో టీ ఊహారాణి, తుళ్లూరు డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్ ప్రభాకర్, ప్రత్తిపాడు డిప్యూటీ ఎంపీడీవో జీ రవికుమార్, తాడేపల్లి డిప్యూటీ ఎంపీడీవో పీ రవికుమార్ ఉన్నారు. వీరిని ఏ మండలాలకు కేటాయించాలన్న విషయంపై జడ్పీ సీఈవో నిర్ణయం తీసుకుంటారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

1,18,286 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,23,302 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,18,286 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 49,794 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13200
నంబరు.5	10000	12500
273	10000	12500
341	10000	13200
4884	10000	11300
సూపర్10	10000	12400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
తేజ	10000	13700
షార్క్-1	10000	12200
బ్యాడిగి 355	10000	13000
సింజెంటా బ్యాడిగి 5531	---	---
దేవనూరుడీలక్స్	10000	12700
ఆర్మూరు	9800	11200
తాలుకాయలు	4500	6500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు నకరికల్లు మండల సమావేశం

నకరికల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీ కాశయ్య సోమవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్, కోఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు. అధికారులు తగు సమాచారంతో హాజరు కావాలన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

● ఎంఈవో సాంబశివరావు

గురజాలటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో సాంబశివరావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఒకటో తరగతిలో 25 శాతం ప్రవేశాలకు నోటిఫికేషన్ వచ్చినట్లు చెప్పారు. తల్లి, తండ్రి లేని అనాథ పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంత కుటుంబాలకు వార్షిక ఆదాయం రూ.1.20 లక్ష లోపు, పట్టణ ప్రాంతంలో రూ.1.44 లక్షల లోపు ఆదాయం ఉన్నవారు అర్హులన్నారు. మే 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బెల్లంకొండ మండలంలో...

బెల్లంకొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఉచిత విద్య అభ్యసించటానికి 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్టు ఎంఈవో బాలసుందరరావు పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు దారిద్ర్యరేఖకు దిగువనున్న పిల్లలను ఉచితంగా చేర్చుకోవాల్సి ఉంది. ఎస్సీ పదిశాతం, ఎస్టీ 4శాతం, బలహీనవర్గాలు, మైనార్టీలకు 6 శాతం, అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు 5శాతం మందికి ప్రైవేట్ పాఠశాలల్లో విద్య అభ్యసించటానికి అవకాశం ఉందన్నారు. ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ, రేషన్‌కార్డు, ఫోటోతో ఏప్రిల్ 28నుంచి మే 15వ తేదీ వరకు సమీపంలోని సచివాలయాల్లో, ఎంఈవో కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు ప్రకృతి విపత్తులపై మాక్ డ్రిల్

దాచేపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా రామాపురం గ్రామంలో ఏపీఎస్‌డీఐఎంఏ ఆధ్వర్యాన మంగళవారం ప్రకృతి విపత్తుల నియంత్రణపై మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వై కుటుంబరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ ప్రారంభం

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌ను సోమవారం ప్రారంభించారు. 40రోజుల పాటు జరిగే ఈ క్యాంప్‌లో విద్యార్థులకు యోగా, ధ్యానం, ఆటలు, పాటలు, డ్రాయింగ్ తదితర అంశాలను నేర్పిస్తారు. ప్రారంభ కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి ఎం వెంకాయమ్మ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



మాచర్లలో గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

మాచర్లటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. మొదటి రోజు స్టోరీ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం నిర్వహించారు. హైస్కూల్ ఉపాధ్యాయులు గ్రంథాలయ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

డొక్కా సీతమ్మకు ఘన నివాళులు

రాజుపాలెం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమోడు శివారు వీరమ్మకాలనీలో డాక్టర్ అంబేద్కర్ అనాథ పిల్లల, వృద్ధాశ్రమంలో డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య ఆధ్వర్యంలో ఆశ్రమంలో టిఫిన్, అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు గరికపాటి శంకరరావు, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, పగడాల నరసింహరావు, చెవుల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామికి అరటికాయల అలంకరణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగన్నకుంటలో వేంచేసియున్న శ్రీకార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవస్థానం 11వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్వామివారికి అరటిపండ్లతో అలంకరణ చేసి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన కోయలమూడి



సత్తెనపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపురం పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి కోయలమూడి శ్రావణ్ శామేల్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడని విద్యాలయం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కిరణ్‌రెడ్డి సోమవారం తెలిపారు. జూలైలో పంజాబ్‌లో జరిగే పోటీలలో పాల్గొంటాడని ఆయన తెలిపారు.

రోడ్డు ఆక్రమిస్తున్నారు...

సత్తెనపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 30వ వార్డులో పార్కు ఎదురుగా గల రోడ్డు స్థలాన్ని కొంతమంది రాత్రికి రాత్రే తవ్వి రోడ్డును పాడుచేస్తున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



30వ వార్డులో రోడ్డును ధ్వంసం చేసి ఆక్రమిస్తున్న దృశ్యం

ఆధార్ అవస్థలు

● విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల కోసం తిప్పలు

● పడిగాపులు కాస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



ఆధార్ నమోదు కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న తల్లిదండ్రులు, చిన్నారులు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు సమీప ప్రాంతాలకు చెందిన వారు తమ ఆధార్ కార్డుల్లో తప్పు ఒప్పులను సరిచేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. విద్యార్థులకు అమ్మఒడికి, పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్లకు, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్‌కార్డులోని పేర్లలో తప్పు ఒప్పులు, చిరునామా మార్పుకై విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. పట్టణంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సోమవారం సర్వర్ రాకపోవడం, ఆంధ్రాబ్యాంక్, గాంధీనగర్ సచివాలయంలో ఉద్యోగులు సెలవులో వుండటంతో పంపుహౌస్ వద్ద సచివాలయంలో వున్న ఆధార్ కేంద్రం ఒక్కటే సోమవారం అందుబాటులో వుండటంతో వివిధ ప్రాంతాల నుండి సుమారు 200మందికి పైగా ఉదయం నుండి సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. ఆ సచివాలయంలో ఉద్యోగి ఒక్కరే వుండటంతో సాయంత్రం వరకు పనిచేసినప్పటికీ ఇంకా కొంతమంది ఆధార్ కార్డులలో సవరణలకు సమయం లేక విద్యార్థులు, తల్లిదండ్రులు నిరుత్సాహంతో వెనుతిరిగారు. ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలో అన్ని ఆధార్ సెంటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సీఎం చంద్రబాబు రైతుల పక్షపాతి

● బుగ్గవాగు రిజర్వాయర్ క్రస్ట్ గేట్ల మరమ్మతులకు రూ.60 లక్షలు విడుదల

● ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతని సాగు నీటి కోసం అన్నదాతల కడగండ్లను పరిష్కరించడానికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం రెంటచింతలలో టీడీపీ నేత తుమ్మా ఎలీషా జోజిరెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుగ్గవాగు రిజర్వాయర్ 2, 4 క్రస్ట్ గేట్ల మరమ్మతులకు ఎన్‌డీఆర్ఎఫ్ నుంచి రూ.60లక్షలు విడుదల చేశారని ఆ నిధులకు అదనంగా మరో రూ.20 లక్షలు కావాలని తాను కోరినట్లు పేర్కొన్నారు. గత వైసీపీ పాలకులు దోచుకోవడం దాచుకోవడమే తప్ప అన్నదాతల బాగోగులను చూసింది లేదని విమర్శించారు. కాలువలకు నీళ్లొదిలిన తరువాత మరమ్మతులు చేపట్టి దోచుకున్న వాళ్లను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నీటి సంఘ అధ్యక్షుడు తుమ్మా బాబు, జోజిరెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి, టౌన్ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, రాయపరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, నీలం మల్లయ్య, ఇన్నారెడ్డి, ల్యాబ్ అంజి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

విద్యతోనే ఉన్నత శిఖరాలు

వెల్దుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధించవచ్చని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఇంకా ఉన్నతంగా ఎదగాలని ప్రశంసాపత్రాన్ని అందించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. అనంతరం ఉపాధ్యాయులతో ముచ్చటించారు. ప్రభుత్వ విద్యలో నాణ్యత పెంచేందుకు ఎటువంటి అవసరాలు ఉన్నా తీరుస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



లక్ష్మీనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యరమల రామచంద్రారెడ్డి

రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువు

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రామచంద్రారెడ్డి

మాచర్ల రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువైందని, కర్నూల్ జిల్లా ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు తిప్పగిరి లక్ష్మీనారాయణ హత్యతో ఇది స్పష్టమైందని పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం లక్ష్మీనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించి విలేకరులతో మాట్లాడారు. పోలీసు పికెట్ కొనసాగుతున్నా కాంగ్రెస్ నేత హత్య జరగడం పోలీసులు విధి నిర్వహణలో అశ్రద్ధ స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. లక్ష్మీనారాయణ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాగిడి ప్రతాప్‌బాబు, మండల అధ్యక్షుడు దొడ్డా శ్రీనివాసరావు, వంగపాటి నాగరాజు, కొమ్ము కోటేశ్వరరావు, ఆదాం, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సీజీజీబీ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్పు

● బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్

దుర్గి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ బ్యాంకులు మే 1వ తేదీ నుంచి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పడనున్నాయని దుర్గి సీజీజీబీ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాతాదారులు తమ లావాదేవీలను ఎటువంటి ఆటంకం లేకుండా నిర్వహించుకోవచ్చన్నారు. ఏవైనా సందేహాలుంటే మీ ఖాతా బ్యాంకు శాఖను సంప్రదించాలని శ్రీనివాస్ సూచించారు.

టీడీపీ కంచుకోట చర్లగుడిపాడు

● టీడీపీ యువనేత యరపతినేని నిఖిల్

గురజాలటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్లగుడిపాడు గ్రామం గత 30 ఏళ్లుగా టీడీపీకి కంచుకోటగా ఉందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు, టీడీపీ యువనేత యరపతినేని నిఖిల్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని చర్లగుడిపాడులో పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా గ్రామానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

రూపెనగుంట్లలో విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన

నకరికల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విత్తనశుద్ధిపై బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం రూపెనగుంట్లలో రైతు సేవాకేంద్రంలో అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి ద్వారా తెగుళ నివారణ, దిగుబడి పెరుగుదల, పచ్చబడటం, మొక్కల పెరుగుదలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ హనుమంతరావు, కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

వాటర్‌గ్రిడ్ ట్యాంక్‌ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన



మంచినీటి ట్యాంక్‌లను నిర్మించడానికి స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రెంటచింతల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి కృష్ణా జలాలను అందించడానికి జలజీవన్ మిషన్ పథకం ద్వారా వాటర్ గ్రిడ్ ఏర్పాటుచేయడానికి అనువైన స్థలాలను గుర్తించేందుకు వివిధ శాఖల అధికారుల బృందం సోమవారం పరిశీలించింది. ఈ పథకం ద్వారా రెంటచింతల మండలానికి రూ.75కోట్లు మంజూరయ్యాయి. తొలుత పాలువాయిగేట్‌లో ఓహెచ్‌బీఆర్ నిర్మించాలని భావించినప్పటికీ ఇప్పుడు 2.5 లక్షల నీటి సామర్థ్యంతో జమ్మలమడకలో నిర్మించబోతున్నారని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వెన్ను వెంకటేష్ చెప్పారు. గోలి, మిట్టగుడిపాడు, పాలువాయి, పశర్లపాడు, కొత్తపాలువాయి, పాలువాయిజంక్షన్, జెట్టిపాలెం, తుమృకోట తదితర గ్రామాల్లోని స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఉన్నత స్థాయి ఇంజనీరింగ్ బృందం, పాలువాయి సర్పంచ్ మండలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి, హనిమిరెడ్డి,తుఫాన్‌రెడ్డి, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా సౌకర్యంపై అవగాహన కల్పించాలి

● ఏపీవో మల్లికార్జునరావు



ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో మల్లికార్జునరావు

దుర్గి, ఏప్రిల్ 28 (ఆంధ్ర జ్యోతి): ప్రధాన మంత్రి సురక్షా యోజన పథకం (ప్రమాద బీమా సౌకర్యం)పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏపీవో మల్లికార్జునరావు ఫీల్డ్ అసిసెంట్లకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సురక్షా యోజన పథకం కింద 18 నుంచి 70 సంవత్సరాలలోపు వారు ప్రతియేటా రూ.20 చొప్పున చెల్లిస్తూ ప్రమాదవశాత్తూ మరణిస్తే ప్రమాదబీమా రూ.2లక్షలు వర్తిస్తుందన్నారు. అలాగే 18 నుంచి 50 ఏళ్ల వయసుగల వారు రాష్ట్రీయ స్వస్థ బీమా యోజన పథకం కింద ఏడాదికి రూ.450 చెల్లిస్తే పలు రకాల ప్రమాద బీమా లభిస్తుందన్నారు. ఈ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పథకం కూలీలందరికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని సూచించారు.

పహల్గావ్ మృతులకు నివాళి

దాచేపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పహల్గావ్ ఉగ్రవాద కాల్పుల్లో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలను కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన కొవ్వొత్తులతో సోమవారం నివాళులర్పించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు చలనాకుల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జాని, ఆదినారాయణ, రైతు నాయకులు ఆదయ్య, గోళ్ల శివయ్య, నవజ్యోతి, బీసీ నాయకుడు బీమవరపు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల కొవ్వొత్తుల ర్యాలీ

సత్తెనపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ సోమవారం రాత్రి పట్టణంలో జర్నలిస్టులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పర్యాటకులను ఉగ్రవాదులు చంపటం దుర్మార్గమన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు.



దాచేపల్లిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న అఖిలపక్ష నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

ప్రధాని సభకు భారీగా తరలిరావాలి

● కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మే 2న జరిగే రాజధాని పునర్నిర్మాణ ప్రారంభకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొంటున్న ప్రధాని మోదీకి పెదకూరపాడు నియోజకవర్గం తరఫున వేలాదిగా ప్రజలు పాల్గొని స్వాగతం పలకాలని కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానికంగా జరిగిన నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధ్యక్షత వహించారు. ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ రాజధానిలో భాగం కానున్న ఈ నియోజకవర్గం నుండి బహిరంగ సభకు 50వేల మందికి పైగా కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రవీణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మద్దతుగా ప్రతి ఇంటినుండి రాజధాని పునర్నిర్మాణ శంఖుస్థాపన కార్యక్రమంలో పాలుపంచుకోవాలన్నారు. ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట నాయకుడు వెన్నా సాంబశివారెడ్డి, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారు రాజన్‌బాబు, నియోజకవర్గంలోని ఐదు మండలాల అధ్యక్షులు మల్లాది విష్ణు, అర్తిమళ్ల రమేష్, నల్లమేకల లక్ష్మీనారాయణ, జానీ బాషా, ఎస్ ఆశీర్వాదం, ఏపూరి నాగేశ్వరరావు, జనసేన నాయకులు యర్రంశెట్టి రామకృష్ణ, ఎంపీపీ మేకల హనుమంతరావు. వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాలుర గురుకులం అప్‌గ్రేడ్ ఎప్పటికో..



గిరిజన బాలుర సంక్షేమ గురుకులం

రెంటచింతల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రెంటచింతలలో మూడు ఎయిడెడ్, మూడు జిల్లా పరిషత్‌లు పాఠశాలలు ఉన్నప్పటికి ఇంటర్ విద్యకు జూనియర్ కళాశాల లేకపోవడంతో వెనుకబడిన వివిధ వర్గాలకు చెందిన విద్యార్థులు బడిబాటకు దూరమవుతున్నారు. నాలుగు సంక్షేమ హాస్టళ్లున్నప్పటికి వాటిలో వుంటూ టెన్త్ వరకే విద్యనభ్యసిస్తునారు. ఆ పై తరగతులకు వెళ్లాలంటే పరిస్థితి అగమ్యగోచరంగా వుంది. రెంటచింతలకు నాలుగు సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. గిరిజన సంక్షేమ హాస్టల్‌లో 3నుంచి 10వ తరగతి వరకు చదువుకోవడానికి ఇతర పాఠశాలలకు వెళ్లేవారు. అయితే 2016 నుంచి ఈ హాస్టల్‌ను గిరిజన సంక్షేమ గురుకులంగా మార్చి ఇక్కడే చదువుకునే అవకాశం కల్పించారు. ఇంటర్ విద్యను అభ్యసించేలా అప్‌గ్రేడ్ చేస్తామన్న పాలకుల హామీలు నెరవేరలేదు. ఈ గురుకులాన్ని జూనియర్ కళాశాలగా మారిస్తే మారుమూల గ్రామాల గిరిజన విద్యార్థులకు ఎంతో మేలు చేకూర్చినట్లవుతుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

పిడుగురాళ్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పురపాలక సంఘ సమావేశం సోమవారం చైర్‌పర్సన్ కేవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఎజెండాలో పొందుపరిచిన అంశాలలో కొన్నింటిపై కౌన్సిలర్లు వాసుదేవరెడ్డి, కొక్కెర శ్రీను, గుర్రం అప్పిరెడ్డిలు పలు ప్రశ్నలు లేవనెత్తారు. వార్డుల్లో పైపులైన్ వేసినా నీటిసరఫరా జరగటం లేదని, పంపుహౌస్ వద్ద వాకింగ్ ట్రాక్‌పై నాణ్యమైన గ్రావెల్‌ను వాడాలని కోరారు. మిగిలిన అంశాలపై సభ్యులందరూ ఆమోదం తెలిపారు. మున్సిపల్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాఘవేంద్రతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

వాసవి అమ్మవారి జన్మదిన మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన నవరాత్రి మహోత్సవాలకు సోమవారం దేవస్థానం అధ్యక్షుడు, కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు శ్రీకారం చుట్టారు. మే 7వ తేదీ వరకు జరిగే ఈ వేడుకలలో ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగనున్నాయని దేవస్థానం అధ్యక్షుడు యేలూరి చంద్రశేఖరరావు, ప్రధానకార్యదర్శి కొలిశెట్టి సుబ్బారావు, కోశాధికారి కొత్త లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయా పూజా కార్యక్రమాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ కేవీ సుబ్బారావు, కనిగిరి శ్రీను, పాండురంగ శ్రీను, జూలకంటి సుబ్రహ్మణ్యం, కొత్త వెంకటచలపతిరావు, గుండా రామారావు, వనజా సాంబశివరావు, కట్టమూరి శంకరరావు, యక్కల భాస్కరరావు, మద్ధాళి సుబ్బయ్య, మోటమర్రి గోపయ్య, కొత్తూరు ఆంజనేయులు, యేలూరి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వర దత్తాత్రేయ స్వామి దేవాలయ నూతన కమిటీ

టీటీడీ కల్యాణ మండపం పక్కన వున్న శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీదత్తాత్రేయస్వామి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం ఈ నెల 30వ తేదీన జరుగనున్నది. కమిటీ గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, కొత్త రఘురామయ్య, కొత్త సత్యనారాయణ, అధ్యక్షుడిగా కొత్త రామారావు, కార్యదర్శిగా బొల్లా శ్రీను, కోశాధికారిగా మారం మల్లికార్జునరావు, కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం


విజయపురిసౌత్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం సోమవారం నాటికి 514.40 అడుగులు ఉంది. ఇది 139.26 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఆలయ భూముల వేలం పాటలు వాయిదా

రెంటచింతల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మల్లవరం గ్రామ శివాలయం భూముల వేలం పాటకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి చెప్పారు.

తెనాలి రైల్వేస్టేషన్‌కు.. నూతన సొబగులు

❖ అమృత్ భారత్ పథకంతో అభివృద్ధి
❖ మెరుగైన వసతులకు రూ.27.70 కోట్లు


రైల్వేస్టేషన్‌లో నిర్మిస్తున్న మూడవ వంతెన


నిర్మాణంలో ఉన్న ఏసీ వెయిటింగ్ హాలు


అంధుల కోసం వేసిన మార్గం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : తెనాలి రైల్వేస్టేషన్ రూపురేఖలు మారుతున్నాయి. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ భారత్ పథకం ద్వారా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రూ.27.70 కోట్లతో ప్లాట్‌ఫారంల అభివృద్ధి, మూడవ వంతెన, ఎస్కలేటర్లు, లిఫ్టులు, అధునాతన టాయిలెట్లు, ఏసీ వెయిటింగ్ హాలు నిర్మాణ పనులు చేస్తున్నారు. ఢిల్లీ, హౌరా-చెన్నై మార్గంలో ప్రధానమైన తెనాలి రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం 160 రైళ్లు ప్రయాణిస్తున్నాయి. 88 రైళ్లు ఆగే ఈ స్టేషన్ నుంచి రోజు 17 వేల మంది ప్రయాణిస్తుండగా టిక్కెట్ల ఆదాయంపైనే రోజు రూ.3 లక్షలు వస్తాయి.

మెయిన్ లైన్‌గా రెండవ ప్లాట్‌ఫారం

పెరిగిన ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండవ ప్లాట్‌ఫారం మెయిన్ లైనుగా మార్చుతున్నారు. మలుపుల కారణంగా 140 కి.మీ వేగంతో వెళ్లాల్సిన రైళ్లు 90 కి.మీ వేగంతో వెళుతున్నాయి. ఈ కారణంగా ఆలస్యం చోటు చేసుకుంటుంది. ఇందుకోసం వేగం పెంచేందుకు రెండవ ప్లాట్‌ఫారం మెయిన్‌లైన్‌గా మార్చి అభివృద్ధి చేస్తున్నారు.

12 మీటర్ల వెడల్పులో విశాలమైన బ్రిడ్జి

రైల్వేస్టేషన్‌లో ఇప్పటికే రెండు వంతెనలు ఉన్నాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 12 మీటర్ల వెడల్పులో మరో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. స్టేషన్ తూర్పు వైపు నుంచి పడమర వైపు బుకింగ్ వరకు విశాలమైన బ్రిడ్జి నిర్మిస్తున్నారు. బ్రిడ్జిపైన ట్రైన్ వచ్చే వరకు వేచి ఉండేందుకు అవసరమైన కుర్చీలు, దుకాణాలు కూడా ఏర్పాటు కానున్నాయి. ప్రతి ప్లాట్‌ఫారం చేరేందుకు ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేస్తారు.

అధునాతన వెయిటింగ్ రూమ్

ఇప్పటి వరకు తెనాలి రైల్వేస్టేషన్‌లో సరైన వెయిటింగ్ రూమే లేదు. దీంతో ప్రయాణికులు రైళ్ల కోసం ప్లాట్‌ఫారంలపైనే దోమల బాధ భరిస్తూ వేచి ఉంటున్నారు. 1వ ప్లాట్‌ఫారంపై అధునాతన వెయిటింగ్ రూమ్ నిర్మిస్తున్నారు. రిజర్వేషన్ కౌంటర్ పక్కనే ఏసీ వెయిటింగ్ హాలు నిర్మాణం చేపట్టారు. 1వ ప్లాట్‌ఫాంపై అధునాతన పద్ధతిలో టాయిలెట్స్ నిర్మిస్తున్నారు. రైల్వే స్టేషన్‌కు వచ్చే అంధులు రైలు ఎక్కేందుకు మరొకరి సాయం లేకుండా మార్గం ఏర్పాటు చేస్తున్నారు. వారు గుర్తించేందుకు వీలుగా ఫ్లోరింగ్‌లో అవసరమైన టైల్స్ నిర్మించారు. స్టేషన్‌లో అడుగుపెట్టిన దగ్గర నుంచి ప్లాట్‌ఫారంపై రైలు ఎక్కే వరకు ప్రత్యేక టైల్స్‌తో దారి వేశారు.

ప్రయాణికులు వాహనాల పార్కింగ్, టిక్కెట్ల కొనుగోలు దగ్గర నుంచి స్టేషన్‌లో అన్ని రకాల దుకాణాలలో చేసే కొనుగోళ్లకు డిజిటల్ పద్ధతిలో చెల్లింపులకు ఏర్పాట్లు చేశారు.

చేతి వృత్తులు చేసుకునే వారికి రైల్వే స్టేషన్‌లో ఒక దుకాణం కేటాయించారు. 1 ప్రొడక్ట్ 1 స్టేషన్ పేరిట ఇక్కడ జ్యూట్ బ్యాగ్‌లు తయారు చేసి అమ్మే దుకాణాన్ని ప్రవేశంలోనే నిర్వహిస్తున్నారు.

6వ ప్లాట్‌ఫాం ఏర్పాటు

రైల్‌వికాస్ నిగమ్ లిమిటెడ్ పథకంలో 6వ ప్లాట్‌ఫాం నిర్మించనున్నారు. స్టేషన్‌లో ఆరు ట్రాక్‌లు ఉన్నప్పటికీ ఐదు ప్లాట్‌ఫాంలు మాత్రమే ఉన్నాయి. 6వ ట్రాక్‌ను గూడ్స్ రైళ్ల లోడింగ్, అన్‌లోడింగ్ కోసం వినియోగిస్తున్నారు. అక్కడ కూడా ప్లాట్‌ఫాం నిర్మించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఆధునిక సిగ్నల్ వ్యవస్థ...

అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైల్వే శాఖ అందిపుచ్చుకుంది. 1వ ప్లాట్‌ఫారంకు రెండు వైపులా చివరన ఉన్న సిగ్నల్ క్యాబిన్స్‌ను తొలగించనున్నారు. అధునాతన కంప్యూటరైజ్డ్ సిగ్నల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు చేపట్టారు. ఈ పనులన్ని మరో మూడు నెలల్లో పూర్తి అవుతాయని స్టేషన్ మేనేజర్ వెంకటరమణ చెబుతున్నారు.


సిద్ధమవుతున్న ఆధునిక టాయిలెట్స్


ఆరవ ప్లాట్‌ఫారం నిర్మించనున్న ప్రదేశం

స్టడీ సర్టిఫికెట్ల కోసం.. పాట్లు

- డీఎస్సీ అభ్యర్థుల ఇక్కట్లు
- స్థానికత నిర్ణయంలో కీలకం
- పాఠశాలలకు వేసవి సెలవులు
- హెచ్‌ఎంలను ఫోన్లలో సంప్రదింపులు



సత్తెనపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ -2025 రిక్రూట్‌మెంట్ కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు స్టడీ సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేటప్పుడు మిగతా ధృవీకరణ పత్రాలతో పాటు.. నాలుగు నుంచి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో తాము చదివిన పాఠశాలల నుంచి స్టడీ సర్టిఫికెట్లను పొందేందుకు ఆయా పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభ్యర్థులకు అందుబాటులో ఉండడం లేదు. డీఎస్సీకి దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ప్రారంభం కాగా, మే 15తో ముగియనుంది. ఈలోగా వేసవి సెలవులు ముగిసే అవకాశం లేకపోవడంతో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను ఫోన్ల ద్వారా అభ్యర్థులు సంప్రదిస్తున్నారు.

30ఏళ్ల నాటి సర్టిఫికెట్ల కోసం వెతుకులాట

డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థుల వయో పరిమితి 44 సంవత్సరాలకు పెంచారు. సంబంధిత వయసు కల్గిన అభ్యర్థులు 35 సంవత్సరాల క్రితం ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో స్టడీ సర్టిఫికెట్ల కోసం వెతుకులాట మొదలు పెట్టారు. అభ్యర్థుల స్థానికతను నిర్ధారించేందుకు స్టడీ సర్టిఫికెట్లనే ప్రామాణికంగా తీసుకుంటారన్న విషయం తెలిసిందే. ఈ ధృవపత్రాల ప్రకారమే అభ్యర్థుల లోకల్, నాన్ లోకల్ స్టేటస్‌ను ఉద్యోగ ఎంపికలో నిర్ణయిస్తారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సర్టిఫికెట్లు తీసుకోవాలంటే అభ్యర్థులు ఆయా సంవత్సరాల్లో చదివిన తరగతుల రికార్డులు, రిజిష్టర్లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరిశీలించి ధృవీకరించాల్సి ఉంది. ఉన్నత పాఠశాలల్లో మాత్రం స్టడీ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. అభ్యర్థులు ఈ ఇబ్బందులకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని కోరుతున్నారు. దీనిపై ఎంఈఓ శ్రీనివాసరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా అభ్యర్థులు తమ దృష్టికి తెస్తే 4, 5 తరగతుల స్టడీ సర్టిఫికెట్లను హెచ్‌ఎంలతో మాట్లాడి ఇప్పిస్తామని తెలిపారు.

ప్రధాని సభకు.. మంత్రులకు బాధ్యతలు

- నేడు సమీక్షించనున్న ఆర్‌అండ్‌బీ మంత్రి
- మంగళగిరి వైపు నుంచి వచ్చే ప్రజల బాధ్యత మంత్రి గొట్టిపాటికి
- రాజధానిలో మనోహర్ రచ్చబండ కార్యక్రమాలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్

గుంటూరు, తుళ్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పనుల పునరుద్ధరణకు శంకుస్థాపన చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ రానుండటంతో నియోజకవర్గాల వారీగా జనసమీకరణ చేసే బాధ్యత సీఎం చంద్రబాబు మంత్రులకు కేటాయించారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో జనసమీకరణ చేయాల్సిందిగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డికి కేటాయించారు. దీంతో ఆయన మంగళవారం ఉదయం 9.30 గంటలకు గుంటూరు నగరపాలకసంస్థ కార్యాలయానికి వచ్చి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, కమిషనర్ పులి శ్రీనివాసులు, పోలీసు, రెవెన్యూ, మునిసిపల్, రోడ్లు, భవనాలు, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫ్యాక్స్ ద్వారా సమాచారం అందించారు. సమావేశానికి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను కూడా హాజరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మంగళగిరి మీదగా వచ్చే ప్రజలు బహిరంగ సభ జరిగే ప్రదేశానికి చేరుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేలా చూడాల్సిందిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు బాధ్యతలు కేటాయించారు. దాంతో ఆయన సోమవారం మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ, జనసేన నాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు.

మరోవైపు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం రాజధానిలోని ఎర్రబాలెం, బేతపూడి, ఐనవోలులో పర్యటించి రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ప్రధాని సభను పండగ వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ సభని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి సోమవారం సాయంత్రం వెలగపూడిలో పర్యటించి ప్రధాని సభ ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. సభా ప్రాంగణం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు, వీవీఐపీలు, ప్రజలు ప్రయాణించే మార్గాలు, వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ప్రాంతాలను పరిశీలించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి సూచనలు జారీ చేశారు.


మంగళగిరి మండలం బేతపూడిలో జరిగిన రచ్చబండలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్


మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్


ప్రధాని పర్యటన ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

మాచర్ల మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా మదార్ సాహెబ్

ఏకగ్రీవంగా ఎన్నిక

మాచర్లటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మున్సిపాలిటీ వైస్ చైర్మన్-1గా 27వ వార్డు కౌన్సిలర్ షేక్ మదార్‌సాహెబ్‌ను కౌన్సిల్ సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికల అధికారిగా గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, అబ్జర్వర్‌గా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ వ్యవహరించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో మదార్‌సాహెబ్‌ను వైస్‌చైర్మన్‌గా బలపరుస్తూ మొత్తం 31 మందికి గాను ఇందులో 21 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరి ఆమోదం తెలిపారు. 17వ వార్డు కౌన్సిలర్ పోలూరి నరసింహారావు.. వైస్ చైర్మన్-1గా మదార్‌సాహెబ్‌ను ప్రతిపాదించగా 1వ వార్డు కౌన్సిలర్ గట్ల అరుణకుమారి, 21వ వార్డు కౌన్సిలర్ ముదిశెట్టి శ్రీనివాసరావులు బలపరిచారు. దీంతో మదార్‌సాహెబ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. గురజాల ఆర్డీవో మురళీకృష్ణ మదార్ సాహెబ్‌కు డిక్లరేషన్ ఫారం అందించారు. అనంతరం మదార్‌సాహెబ్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా హాజరైన ఎమ్మెల్యే జూలకంటి.. మదార్‌సాహెబ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నిరంకుశత్వం నుంచి ప్రజాస్వామ్యం వైపు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ హయాంలో మాచర్ల మున్సిపాలిటీలో నిరంకుసత్వం రాజ్యమేలిందన్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో నామినేషన్ వేయడానికి వచ్చిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులపై దాడులు చేసి, కేసులు పెట్టి మరీ 31 వార్డుల్లో 31 మంది వైసీపీ నాయకులను కౌన్సిలర్‌లుగా ఏకగ్రీవం చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ 10 నెలల కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసీపీ కౌన్సిలర్లు స్వచ్ఛందంగా వచ్చి టీడీపీలో చేరుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. మాచర్ల మున్సిపాలిటీ సర్వతో ముఖంగా అభివృద్ధి సాధించే దిశగా కౌన్సిల్ పనిచేయాలని సూచించారు.

వైస్ చైర్మన్ - 1 ఎన్నిక దృష్టిలో ఉంచుకొని కౌన్సిలర్లను కూడగట్టడంలో టీడీపీ సీనియర్ నాయకుడు [illegible] కేశవరెడ్డి సమర్థవంతంగా [illegible]హించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డిని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.


మదార్‌సాహెబ్‌కు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారు : వైస్ చైర్మన్ మదార్‌సాహెబ్

జూలకంటి నాగిరెడ్డి, దుర్గాంబ హయాం నుంచి జూలకంటి కుటుంబం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటోందని మదార్‌సాహెబ్ పేర్కొన్నారు. ఆ వారసత్వం నుంచి వచ్చిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తనకు వైస్ చైర్మన్ పదవిని కానుకగా ఇచ్చారని తెలిపారు. అనంతరం మదార్‌సాహెబ్ కుటుంబసభ్యులు ఎమ్మెల్యే జూలకంటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యార్డుకు రక్షణ ఏదీ

- కూలిన ప్రహరీ.. ఇసుక దిబ్బలు
- నాటి వైసీపీ నాయకుల నిర్వాకం
- ఇసుక వ్యాపారానికి వాడుకున్న వైనం

శుభ్రం చేయకుండా వదిలివేసిన యార్డు స్థలం



వేమూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వేమూరు మార్కెట్ యార్డుకు రక్షణ కొరవడింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి నాయకులు యార్డు స్థలాన్ని ఇష్టారాజ్యంగా వాడుకుని నాశనం చేశారు. కోట్లాది రూపాయలు దండుకునేందుకు యార్డు స్థలాన్ని ఇసుక డంపింగ్ కోసం వాడుకున్నారు. అనధికారికంగా వేయింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలం అంతా ఇసుక గుట్టలు మేటలుగా వేయడంతో ప్రహరీ గోడలకు ఒత్తిడి ఏర్పడి అవి పడిపోయాయి. అనంతరం వాటిని ఆనాడు చైర్మన్‌గా పని చేసిన వ్యక్తి తూతూమంత్రంగా నిర్మించాడు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా గోడలు నిర్మించడం వల్ల తిరిగి అవి ఎక్కడికక్కడ పడిపోయాయి. రైతులకు ఉపయోగపడాల్సిన యార్డు ఇలా అవడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలసిన రైతులు డిమాండ్ చేస్తున్నారు.


తూతూ మంత్రంగా నిర్మించడంతో మళ్లీ పడ్డ గోడ


యార్డు ప్రాంగణంలో ఇసుక డంపింగ్ వల్ల పడిపోయిన ప్రహరీ


వైసీపీ నేతలు అనధికారికంగా ఏర్పాటు చేసిన వేయింగ్ మిషన్

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పీటీడీ, నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల్లో ఈ నెల 28, 29 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నాయని, దానిలో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద సోమవారం ఆ యూనియన్‌ల సిబ్బంది నిరాహార దీక్షలు చేపట్టారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని దీక్షల్లో పాల్గొన్న ఎన్ఎంయూఏ సెక్రటరీ నాయక్ డిమాండ్ చేశారు. దీక్షలో కృష్ణ, ఎస్‌కేఎస్ బాబు, ఎస్‌కే మౌలాలి, సైదా, నాగేశ్వరరావు, కేఎస్ఎన్ రెడ్డి, కేఎస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



ప్రత్యేక అలంకరణలో బొల్లుమోర వేంకటేశ్వరస్వామి

ఘనంగా బొల్లుమోర వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల

యడ్లపాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొండవీడు కొండలపై ఉన్న పురాతన బొల్లుమోర వేంకటేశ్వరస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారి దర్శనంకోసం వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణం సంతరించుకుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. తిరునాళ్ల సందర్భంగా స్వామివార్ల శాంతికల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు కవి కమలారామ్‌కు ఆహ్వానం



కవి కమలారామ్

వినుకొండ టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీ కళా వేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఆధ్వర్యంలో మే 10,11వ తేదీల్లో ఏలూరు పట్టణంలో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు పట్టణానికి చెందిన కవి కమలారామ్‌కు ఆహ్వానం అందినట్లు సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశ్రీ కళా వేదిక కవులను ప్రోత్సహించేందుకు, తెలుగు భాషను బతికించేందుకు, ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడంపై కళావేదికకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

సంక్షిప్తం...

- వినుకొండ టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పది పరీక్షల్లో పట్టణంలోని విద్యావికాస్ హైస్కూల్ విద్యార్థి దత్తలూరి సైదావలి 589మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా నియోజకవర్గ నూర్‌బాషా సంఘం ఆధ్వర్యంలో సైదావలిని సోమవారం ఘనంగా సత్కరించారు.
- నాదెండ్ల: రైతులకు ఉచిత భూసార పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలలో 900 మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సోమవారం నాదెండ్లలో మట్టి నమూనాలను సేకరించారు.
- బొల్లాపల్లి: మండలంలోని గాటితండాలో సోమవారం పోలేరమ్మ తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
- రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలోని ఈదులమ్మ తల్లి ఆలయ 26వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగాయి. గౌడ కులస్థులతో పాటు గ్రామస్థులు, మహిళలు, భక్తులు అధికసంఖ్యలో ఆలయాన్ని సందర్శించారు.
- ఈపూరు: 2025-26 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలలో పేద విద్యార్థులు చేరేందుకు 25శాతం ఉచిత ప్రవేశాల కోసం మే 2 నుంచి మే 19 లోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈవో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.
- నరసరావుపేట రూరల్: పట్టణంలోని వీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ పునః నిర్మాణం కోసం అమెరికాలో నివాసం ఉండే కోరే నరేంద్ర కుమార్, బాలభార్గవి దంపతులు రూ.1,00,116 సోమవారం దేవస్థానం కమిటీ సభ్యులకు అందజేశారు.

రైతు తలసరి ఆదాయం పెంచడమే సీఎం లక్ష్యం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న చీఫ్‌విప్ జీవీ, మక్కెన తదితరులు

వినుకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రైతు తలసరి ఆదాయం పెంచి రాష్ట్రంలోనూ, దేశంలోనూ అగ్రస్థానంలో నిలపడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో రాయితీపై రూ.50లక్షల విలువైన వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను పనిముట్లను సోమవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ డ్రోన్‌ల సాయంతో ఎరువులను వేయడం రైతులకు లాభసాటిగా ఉందని, వీటిని 80శాతం రాయితీతో అందజేయడం జరుగుతుందని, ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.10లక్షలు ఉంటే రూ.8లక్షలు సబ్సిడీ వస్తుందని, దీనిలో 50శాతం కేంద్రం భరాయించగా మిగతాది రాష్ట్ర ప్రభుత్వం భరాయిస్తుందని తెలిపారు. సీఎం చంద్రబాబు సంకల్పం మేరకు రాష్ట్రంలో రూ.417కోట్లతో వేలాదిమంది రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నామని, గత టీడీపీ హయాంలో కూడా సుమారు 3 లక్షల మంది రైతులకు రూ.1227 కోట్లు విలువైన పరికరాలను పంపిణీ చేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.340కోట్లు ఖర్చుచేసి ఆ లక్ష్యాన్ని నీరుగార్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం ఇచ్చే చోట మిగతా గ్రాంట్ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా వ్యవసాయ పథకాలను మూలనపెట్టిన రైతుద్రోహి జగన్ అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 3లక్షల మందికి పైగా రైతులకు భూసార పరీక్షలు చేసి పంట సూచికలను అందించినట్లు తెలిపారు. సేంద్రియ సాగుకు పెద్దఎత్తున ప్రోత్సాహం ఇస్తున్నామని, రైతులు కూడా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించేలా ముందుకు వెళ్లాలని సూచించారు. మంచి దిగుబడులు ఆదాయం ఇచ్చే ఉద్యాన పంటల్లో రాణించాలని, రైతు బాగుంటేనే దేశం కూడా బాగుంటుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీనురాయల్, లగడపాటి వెంకట్రావు, మీసాల మురళీకృష్ణ, ముండ్రు సుబ్బారావు, గోవిందునాయక్, పత్తి పూర్ణచంద్రబాబు, బచ్చు అంజిరెడ్డి, ఏవో వరలక్ష్మి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి లక్ష్యాలను ఎంచుకోవాలి

వినుకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి లక్ష్యాలను ఎంచుకొని వారి ఉజ్వల భవిష్యత్‌కు మార్గం వేసుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని కొత్తపేటలో గీతాంజలి పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు విద్యార్థులు మంచి మార్కులు సాధించడంపై అభినందనలు తెలిపి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పాఠశాల డైరెక్టర్ వై.ఎల్.కిషోర్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: కలెక్టర్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 168 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో మురళి, వివిధ శాఖల జిల్లా అధికారులు. తదితరులు పాల్గొన్నారు.

● విద్యాహక్కు చట్టం 2009 12(1) సీ ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో 25శాతం సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ప్రత్యేక బాధిత కుటుంబాల విద్యార్థులకు ఇవ్వాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ కోటనాయక్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కత్వా చెరువు, ఆవుల సత్రం పక్కన కబ్జాదారుల నుంచి వాగును కాపాడాలని ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, వీ కోటనాయక్, థామస్ తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ ఎన్ఆర్ఎల్ నాగేశ్వరావుకు మాతృ వియోగం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విశ్రాంత న్యాయమూర్తి ఎన్.ఆర్.ఎల్ నాగేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు నడింపల్లి శ్రీశైలకుమార్, నడింపల్లి అమర్నాథ్‌ల మాతృమూర్తి, సీనియర్ న్యాయవాది దివంగత నడింపల్లి వెంకట అప్పారావు సతీమణి జానకి సుశీల (94) వయోభారంతో సోమవారం తుది శ్వాస విడిచారు. నరసరావుపేట న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు కార్యవర్గ సభ్యులు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పట్టణ ప్రముఖులు ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



వృద్ధుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 73 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 73 ఫిర్యాదులు అందాయి. నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ సంబంధిత అధికారులకు సూచించారు.

ఆటో డెస్క్ ఫ్యూజన్ 360లో ఎన్ఈసీ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని శ్రీసాయిరాం ఐసీటీ అకాడమీలు సంయుక్తంగా ఈ నెల 24, 25 తేదీలలో నిర్వహించిన ఆటో డెస్క్ ఫ్యూజన్ 360 పోటీలలో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 5వ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ఎన్ఈసీ కళాశాల మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ వెంకట శివ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల నిర్వాహకులు, సిబ్బంది అభినందించారు.

రేషన్ పంపిణీని సకాలంలో పూర్తిచేయాలి

●చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్‌లు రేషన్ పంపిణీని సకాలంలో పూర్తిచేసి కార్డుదారులకు ఉన్నతమైన సేవలందించాలని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో నియోజకవర్గంలోని రేషన్ డీలర్లతో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జీవీ మాట్లాడుతూ రేషన్ డీలర్లు సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడి పేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రేషన్ పంపిణీ సక్రమంగా జరగకపోతే అధికారులకు, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, రేషన్ డీలర్లు అందరూ బాధ్యతగా పనిచేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఐదు మండలాల తహసీల్దార్‌లు రేషన్ పంపిణీని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల తహసీల్దార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎన్‌సీ అండ్ కేఆర్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఎన్‌సీ అండ్ కేఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. నసరావుపేట పరిసర ప్రాంతాల నుంచి వివిధ కళాశాలలో డిగ్రీ, పీజీ కెమిస్ట్రీ చదివిన విద్యార్థులు ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. 47 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 20 మంది విద్యార్థులు జూనియర్ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్ ఉద్యోగలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర మేదరమెట్ల ప్రేమ్‌చంద్, కళాశాల జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాసప్రసాద్, ప్రిన్సిపాల్ జీ వెంకటేశ్వరరావు, అకడమిక్ ప్రిన్సిపాల్ కే హరికృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా అమరావతి నిర్మాణం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా రాజధాని అమరావతి నిర్మాణం చేపట్టినట్లు టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని లేని రాష్ట్రానికి అమరావతి వంటి గొప్ప రాజధాని నిర్మించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయించుకున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అమరావతిని తీవ్రంగా నాశనం చేసిందన్నారు. నాడు 2019లో టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే ఈనాడు రాజధాని నిర్మాణం పూర్తయి రాష్ట్రానికి మరింత అభివృద్ధి చేసేందుకు మెరుగైన అవకాశాలు ఉండేవన్నారు. సీఎం చంద్రబాబు మహా సంకల్పంతో అమరావతి రాజధాని నిర్మాణం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రజా రాజధాని అమరావతి శంకుస్థాపనకు మే2న ప్రధానమంత్రి మోదీ రానున్నారని తెలిపారు.

కోటప్పకొండ దేవస్థానానికి రూ.1.08 లక్షల విరాళం

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయానికి నరసరావుపేట మండలం యలమందలకు చెందిన మానుకొండ శివరామకృష్ణ రూ.1,08,000 విరాళం అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు చేతుల మీదుగా సోమవారం విరాళం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాండవ కృష్ణ, రామకృష్ణ తదతరులు పాల్గొన్నారు.

కిషోర బాలికల సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

●ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కిషోర బాలికలకు పటిష్టమైన రక్షణ ఇవ్వడంతోపాటు వారికి సాధికారతను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కిషోరి వికాసం కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిషోరి వికాసంపై మహిళా పోలీసులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, అంగనవాడీలు, వీవోఏలకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని కిషోర బాలికలకు వారి హక్కులు, సమస్యలు, వ్యవస్థలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుగుణ, ఏపీఎం వాసుబాబు, ఏపీవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

నల్లరిబన్లతో పారిశుధ్య కార్మికుల నిరసన

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని నల్లరిబన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నరసరావుపేటలో నిర్వహిస్తున్న సమ్మె సోమవారం 40వ రోజుకు చేరుకుంది.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభం

వినుకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ పిలుపుమేరకు సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు 40 రోజుల పాటు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు గ్రంథాలయ అధికారి భూక్యా బద్రీనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● బొల్లాపల్లి: మండల కేంద్రమైన బొల్లాపల్లి శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి గ్రంథాలయ శిక్షణ తరగతులు ప్రారంభమైనట్టు గ్రంథాలయ నిర్వాహకులు రామావత్ సేవానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా సేవానాయక్ మాట్లాడుతూ సోమవారం మొదటి రోజు 40రోజుల పాటు 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రోజుకు ఒక అంశంపై ఇంగ్లీషు గ్రామర్, తెలుగు వ్యాకరణ, జీకే చెస్, క్యారమ్స్ అంశాలపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

● నాదెండ్ల: మండలంలోని నాదెండ్ల గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయ అధికారి రావూరి శ్రీనివాసరావు విజ్ఞానం పెంపొందించే పలు కథలను నేర్పించారు.

● ఈపూరు: ఈపూరు శాఖా గ్రంథాలయంలో సోమవారం యేసు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఇంగ్లీష్ ఉపాధ్యాయులు డీఎస్ ప్రసాదు గ్రామర్‌పై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచ్ నుంచి డీసీసీబీ చైర్మన్ స్థాయికి..

● మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ప్రస్థానం



మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

వినుకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగి నేడు ఉమ్మడి గుంటూరు జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా ఎంపికయ్యారు. వినుకొండ మండలంలోని పెదకంచెర్ల గ్రామానికి మొట్టమెదటి సర్పంచ్‌గా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన మక్కెన మల్లికార్జునరావు తరువాత అదే మండలానికి ఎంపీపీగా, జడ్పీటీసీగా, అనంతరం వినుకొండకు ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచారు. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర విభజన తర్వాత చోటుచేసుకొన్న రాజకీయ పరిణామాలతో వైసీపీలోకి చేరిన మక్కెన 2024 శాసన సభ ఎన్నికలకు ముందు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు గెలుపుకోసం కృషిచేశారు. మక్కెన సేవలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళి డీసీసీబీ చైర్మన్‌గా ఆయనకు సముచిత స్థానాన్ని కల్పించడంలో చీఫ్‌విప్ జీవీ కీలకపాత్ర పోషించారు. డీసీసీబీ చైర్మన్‌గా తన నియామకానికి సహకరించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖమంత్రి లోకేశ్, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు మక్కెన ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు.



వ్యర్థాలు తొలగించిన వెల్లటూరు బస్ షెల్టర్

బస్ షెల్టర్‌లో వ్యర్థాల తొలగింపు

బొల్లాపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు బస్టాండ్ సెంటర్‌లో బస్ షెల్టర్ వ్యర్థాలతో నిండిపోవటంతో ప్రయాణికులు రోడ్డుపైనే బస్సుల కోసం నిలబడి ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సోమవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు ఆ బస్ షెల్టర్‌లో ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఇంకా నీటితో శుభ్రం చేసి, బండలను సరిచేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. వ్యర్థాల తొలగింపుతో కనీసం నిలుచునేందుకు అవకాశం కలిగిందని ప్రయాణికులు, గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

షాపులు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

శావల్యాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణల పేరుతో మండలంలోని గంటవారిపాలెంలోని పాముల కాలనీవాసుల షాపులను బలవంతంగా కూల్చివేసినవారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో శావల్యాపురం సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. పోరాటసమితి రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ షాపులు కూల్చివేసి పదిరోజులవుతున్నా ఉన్నతాధికారులు గానీ, పోలీసులు గానీ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోరాట సమితి జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, ఓర్సు శ్రీనివాసరావు, జక్కా బ్రహ్మయ్య, చలంచర్ల అంజి, కాశిం తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వేసవి శిక్షణ తరగతులు

యడ్లపాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక సాంస్కృతి వేదిక బాసట ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించే వేసవి శిక్షణ తరగతులు స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. మాజీ ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ పోపూరి గంగయ్య చౌదరి, విశ్రాంత అధ్యాపకులు జొన్నలగడ్డ శేషయ్యలు ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులకు పలు విషయాలపై మార్గనిర్దేశం చేశారు. తొలిరోజు తరగతులకు హాజరైన 200 మంది విద్యార్థులకు నోట్‌బుక్, పెన్ను బహుమతిగా అందజేశారు.